ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (గుండుగొలనులో శ్రీనాన్నగారి ప్రవచనము, 30-6-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఎంతకాలము అయితే మీలోపల ఉన్న అహంభావనతోటి, దేహగతమైననేనుతోటి సంబంధం పెట్టుకొని ఉంటారో అంతకాలము మీరు ఎన్ని సాధనలు చేసిన, ఎన్ని ప్రక్రియలు చేసినా, ఎన్ని గుంజీలు తీసినా మీకు మోక్షం రానేరాదు. బాహ్యంగా మీరు పూజలు, జపాలు చేసుకొంటే చేసుకోవచ్చును. కాని మీలోపల ఉన్న అహంవృత్తితో సంబంధం ఉన్నంతకాలము మీకు మోక్షసుఖం తెలియదు. మీలోపల ఉన్న అహంవృత్తితో మీకు ఎంతవరకు సంబంధం ఉందో భగవంతుడు చూస్తూఉంటాడు. ఆ సంబంధం తెగిపోతే వెంటనే మోక్షం వస్తుంది. ఆ సంబంధం తెగకపోతే ఎన్నివేల జన్మలు ఎత్తినా నీకు మోక్షం రాదు. బాహ్యమైన ప్రక్రియలవలన, జిమ్మిక్కులవలన మోక్షం వస్తుందని పొరపాటు అభిప్రాయం పెట్టుకోవద్దు.

కొంతమంది పైకి అహంకారము ఉన్నట్లు కనిపించరు. మీకు ఉన్న అహంకారము ఇతరులకు, సమాజానికి కనిపించకపోవచ్చు. మీకు ఉన్న అహంకారము బయటకు కనిపిస్తోందా, కనిపించటంలేదా అన్నది ముఖ్యంకాదు. మీలోపల అహంకారము ఉందా, లేదా అని పరమేశ్వరుడు చూస్తాడు. పరమేశ్వరుడు directగా మీ హృదయాన్ని చూస్తూ ఉంటా(ు). మీకు ప్రత్యక్షముగాగాని, పరోక్షంగాగాని మీలోపల ఉన్నటువంటి అహంభావనతో ఏ రూపములో సంబంధం ఉన్నప్పటికీ మీకు మోక్షంవచ్చే అవకాశము లేదు, శాంతికూడా కలుగదు. ఎవడైతే తన మనస్సును నిగ్రహించుకోవాలి అని అనుకొంటున్నాడో వాడు ముందు అహంవృత్తిని కొంచం నెమ్మదిపరచాలి. అహంవృత్తిని తొలగించుకోవాలి అనే సంకల్పము మీ హృదయాంతరాళములలో ఎంతో కొంత లేకపోతే మనస్సును నిగ్రహించుకోవటానికి నీవు ప్రయత్నంచేసినా అది సాగదు. నీవు ఒడ్డుకు రాలేవు. అహంవృత్తిని పోగొట్టుకోవాలనే తలంపు మీకు లేకపోతే మీ ప్రయత్నం ఫలించదు. మనస్సుకు వేరు దేహగతమైన నేను అంటే అహంభావన. ఆ వేరును తొలగించుకొనే ప్రయత్నం మీరు చేస్తే మనస్సు దానంతట అదే స్వాధీనంలోనికి వస్తుంది. ఎవడైతే తన అహంవృత్తిని పోగొట్టుకోవటానికి హృదయపూర్వకంగా ప్రయత్నం చేస్తున్నాడో వాడికి మనోనిగ్రహం కలుగుతుంది.

అహంవృత్తిలోనుండి వేరుపడటం అంత తేలిక కాదు. ఎందుచేతనంటే అదే నువ్వు అనుకొంటున్నావు. ఏదైతే నీవు కాదో అదే నువ్వు అనుకొంటున్నావు. అహంకారము నీవు అనుకొన్నప్పుడుకూడా నీవు అహంకారము కాదు. దానిలోనుండి విడిపోవాలి. దీనికి సాధనాబలం ఉండాలి, గురువు అనుగ్రహం ఉండాలి. మనం చనిపోయినపుడు శరీరం మారుతుంది గాని జీవుడు ఏమీ మారడు. మనలోఉన్న జీవలక్షణాలు నశించాలి. జీవలక్షణాలకు వేరు అహంకారము. అహంకారముపోతేగాని జీవలక్షణాలు నశించవు. అహంకారము నశిస్తేనేగాని మోక్షంవచ్చే అవకాశం లేదు.

నీ వ్యక్తిభావనకు లోకంలో ఒక ఆకర్షణకాదు అనేక ఆకర్షణలు ఉన్నాయి. మనం చెడిపోవటానికి లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. కుండలో ఉన్ననీరు అంతా బయటకు రావటానికి కుండకు పది చిల్లులు అక్కరలేదు ఒక్క చిల్లుఉన్నా సరిపోతుంది. అలాగే లోకంలోఉన్న ఏ ఆకర్షణకు లోబడినా మనిషి

పతనమవుతాడు. లోకంలో ఎన్ని ఆకర్షణలు ఉన్నప్పటికీ ఈ ఆకర్షణలు ఎవరికి అని ప్రశ్నవేసుకొంటే దేహగతమైన నేనుకే. అంటే ఇవి అన్నీ అహంకారములోనుండి వస్తున్నాయి. అహంకారముతో సంబంధంలేకుండా లోకానికి తనంతట తానుగా అస్థిత్వం లేదు. మనస్సుఉంటే లోకంఉందిగాని మనస్సు లేకపోతే లోకంలేదు. లోకం ఉందని మనస్సు చెపుతోందికాని లోకం నేను ఉన్నానుఅని ఎవరికీ చెప్పటంలేదు. లోకానికి ప్రత్యేకమైన ఉనికిలేదు. నీవు ఎలాఉన్నావో ప్రపంచంకూడా అలాగే కనిపిస్తుంది అన్నారు భగవాన్. మనలోఉన్న బలహీనతలను లోకం చూపిస్తుంది. అప్పుడు మనం సాధనచేసి ఆ బలహీనతలను తొలగించుకోవాలి.

నీవు ఏదైనా దీర్ఘరోగంతో బాధపడుతున్నావు అనుకో. అందులోనుండి బయటకువస్తేగాని నీకు ఆరోగ్యం కలుగదు. ఆ రోగం తగ్గకుండా నేను ఆరోగ్యంగానే ఉన్నానుఅని చెప్పటం ఎటువంటిదో అహంకారమునే పిశాచమును లోపలపెట్టుకొని మేము శాంతిగా ఉన్నాముఅని చెప్పటంకూడా అటువంటిదే. ఆ రోగంనుండి బయటపడితేనేగాని నీకు ఆరోగ్యంచిక్కదు. అలాగే అహంకారమునుండి బయటపడితేనేగాని నీకు జ్ఞానం కలుగదు. అహంకారమునుండి బయటపడ్డారు అనుకోండి ఏదో పొందుతాము అనుకోకండి. కొత్తగా పొందేది ఏమీలేదు. మీస్వరూపాన్ని మీరు పొందుతారు. అప్పుడప్పుడు మీకు సుఖంగా, శాంతిగా, ఆనందంగా ఉంటుంది. అది ఎవరిదో అనుకొంటున్నారు. అది ఆత్మదే, అది మీస్వరూపానిదే. ఎప్పుడయితేమీకు ఆత్మానుభవం కలిగిందో లోకంఅంతా సుఖంగా, శాంతిగా మీకుకనిపిస్తుంది. ఇప్పుడు నేనుఅనేటప్పటికి మీకు దేహం స్ఫురిస్తోంది. అహంకారమునుండి బయటకువచ్చినపుడు నేనుఅనేటప్పటికి బ్రహ్మంస్ఫురిస్తుంది.

కొంతమంది తెలివితో, కొంతమంది ధనంతో, కొంతమంది అధికారంతో తాదాప్యంచెందుతారు. ఏమీలేనివారు దేహంతో తాదాప్యంచెందుతారు. కొంతమంది బుద్ధితో తాదాప్యం పొందుతారు. మనం ఎంత బంధంలో ఉన్నామో వారుకూడా అంతేబంధంలో ఉన్నారు. మనం ఎంత అజ్ఞానంలో ఉన్నామో వారుకూడా అంతే అజ్ఞానంలో ఉన్నారు. అహంభావన స్వతంత్రముగా ఉండలేదు. దేనితో ఒకదానితో తాదాప్యం పొందుతూ ఉంటుంది. జైలులోఉన్నవారికి Aక్లాసు, Bక్లాసు, Cక్లాసు అని ఉంటాయి. ఏ క్లాసులోఉన్నా సదుపాయాలు తేడాతప్ప మొత్తంమీద జైలులోఉన్నట్లే, అలాగే నీకు దేనితో తాదాప్యంఉన్నా నీవు అహంభావనలో ఉన్నట్లే. నీకు దేనితోనూ తాదాప్యం ఉండకూడదు. అంటే అహంభావన వేరుతోసహా నశించాలి.

ఆత్మఅంటే మనమే. అది మనంఅన్నసంగతి మనకు తెలియటంలేదు. నిన్ను నీవు తెలుసుకొనేది ఆత్మవిద్య. ఆత్మఅంటే మీరే. ఇది మీగుండెకు బాగాపట్టాలి. నేనుఅనే తలంపును విచారణచేస్తే అది ఈజన్మలో అణిగిపోతుంది. విచారణచెయ్యకుండా వదలివేస్తే కోట్లాదిజన్మలు ఎత్తవలసిందే. మనంఎవరో మనకు తెలిసేవరకూ మనంకానిదానితో తాదాప్యం పొందుతూఉంటాము. రంగుతోనూ, ధనంతోనూ, విద్యతోనూ, అధికారంతోనూ తాదాప్యం పొందుతాము. మనం ఎవరిమో మనకు తెలిసినపుడు ఇంక తాదాప్యం ఉండదు. నిశ్చయజ్ఞానమే వివేకం. అంటే సందేహంలేని జ్ఞానము వివేకము. ఆత్మజ్ఞానం అంతనిశ్చయంగా నీకు కలగాలి. నేను అనే తలంపు ఆత్మలోనుండి వస్తోంది. ఈనేనుఅనే తలంపు ఎక్కడయితే అణిగిపోయిందో అక్కడ ఆత్మజ్ఞానం కలుగుతుంది. నీకు జ్ఞానం కాశీలో కలుగదు, రామేశ్వరంలో కలుగదు, తిరుపతిలో కలుగదు. ఎక్కడో కలుగుతుంది అనితిరుగుతున్నావు. నీకు డబ్బుఉంది తిరుగుతున్నావు. నీవు హృదయపూర్వకంగా సాధనచేస్తూ ఉంటే ఏదోఒక జన్మలో జ్ఞానంఅనేది నీహృదయంలోనే కలుగుతుంది అని కృష్ణుడు గీతలోచెప్పాడు. నీలోని బలహీనతలు, పాపాలు, దోషాలు పోగొట్టుకోవటానికి బహుజన్మలకృషి అవసరము. అందువలన బహుజన్మలకృషివలన కాలప్రవాహంలో నీకుజ్ఞానం కలుగుతుంది.

అహంకారం అణిగినంతమాత్రంచేత నేను మాయలోనుండి బయటకు వచ్చానుఅని అనుకోవద్దు.

అహంకారముయొక్క మూలం నశించినపుడుమాత్రమే నీవు మాయలోనుండి బయటకు రాగలవు. అహంకారము వేరుతోసహా నశించకపోతే నీవు తిరిగి మాయలోపడే అవకాశంఉంది. దేహంఉన్నంతకాలము ఏదోఒకరోగం రావటానికి అవకాశంఉంది. అలాగే అహంభావన ఉన్నంతకాలము మీరు మాయలోపడే అవకాశం ఉంది. మీముక్కులోగాలి తిరుగుతున్నంతకాలము మీరు సాధనవిషయంలో శ్రద్ధగా ఉండవలసిందే.

మీరుసాధనచేసి తాత్కాలికంగా అహంకారమును అణచినప్పటికి లోపలవేరు ఉందికదా మరల విజృంభణ వచ్చేస్తుంది. అప్పుడు పూర్వపు వాసనలు, అలవాట్లుఅన్నీ వచ్చేస్తాయి. అహంకారము పూర్తిగా వేరుతోసహా నశించాలి అంతవరకూ నమ్మటానికి వీలులేదు. అహంభావన వేరుతోసహా నశించినపుడు అజ్ఞానములోనుండి బయటకువచ్చాను, అలవాట్లలోనుండి బయటకువచ్చానుఅని అనుకోవాలిగాని అహంభావన వేరుతోసహా నశించకుండా నీవు మాయలోనుండి బయటకు రాలేవు. వర్షాకాలంలోచూడండి. మబ్బులుపడుతూ ఉంటాయి, చెదిరిపోతూ ఉంటాయి. మనం వర్షంరాదు అనుకొంటాము. మరలకొద్దిసేపటికి అన్నివైపులనుండి మబ్బులువచ్చి గంటలతరబడి వర్షంకురుస్తుంది. అదేవిధంగా అహంకారం అణిగిఉంటే అది తిరిగి విజృంభించినపుడు రాగద్వేషములు, అన్ని తలంపులువచ్చి నిన్ను ముసిరేస్తాయి. అహంభావన ప్రేరణవలన మీరుచేసే పనులు, ఆలోచనలు, సంకల్పాలు వీటిఅన్నింటిని వదులుకోవటానికి సిద్ధపడకపోతే మీకు ఆత్మానుభవం కలుగదు. అహంభావన ప్రేరణతోమాటలువస్తే నీవు మౌనంగా ఉండు. అహంభావన ప్రేరణతో పనులుచేయవద్దు. అలా నిగ్రహించుకోవటంవలన భగవంతుడు నిన్నుఅనుగ్రహిస్తాడు. అనుగ్రహించి నీహృదయంలోఉన్న ఆనందము నీచేతికి అందేలా చేస్తాడు. అప్పుడు ఉన్నవస్తువు తనంతటతానుగా నీకు వ్యక్తమవుతుంది.

24 గంటలు మానసిక పూజచేయటం నేర్చుకో అంటున్నారు. ఉదయం కొద్దిసేపు పూజచేస్తారు. తరువాత దేవునిగొడవ ఉండదు. అలాకాదు నీవు దేవునిబొమ్మదగ్గర కూర్చోకపోయినా 24గంటలు మానసికపూజ చేయటం నేర్చుకో అంటున్నారు ఆచార్యులవారు. నీవు ఎక్కడకూర్చొన్నా, ఏపనిచేస్తున్నా నీ మనస్సుతో దేవునిపూజించటం నేర్చుకో అంటున్నారు. అప్పుడు నీకు మోక్షానుభవం కలుగుతుంది. నిరంతరము నీ మనస్సులో భగవంతుని పూజించు. అది మానసికపూజ. మీడబ్బుగురించి ఇతరులకు చెప్పరు. గుట్టుగా ఉంచుకొంటారు. కాని మీభక్తిగురించి ఇతరులకుచెపుతారు. మీభక్తికూడా గుట్టుగా ఉంచుకోవాలి. మీభక్తి అందరికీ తెలిసిపోవాలిఅని అనుకోకూడదు. మీభక్తి అందరికీ తెలిసిపోవాలిఅని అనుకొంటే మీకుభక్తి పెరగదు, అహంకారం పెరుగుతుంది. భక్తిఎంత రహస్యంగా ఉంటే అంతమంచిది.

ఆత్మకు శత్రువు ఎవరుఅంటే అహంభావన. ఆత్మఅంటే మీరేఅని మర్చిపోకండి. ఆత్మమీరే అయినప్పటికి మీకు ఆత్మానుభవం రావటంలేదు. అలారాకుండాచేసేది ఎవరుఅంటే అహంభావనే. అందుచేత మీకు శత్రువు ఎవరుఅంటే అహంభావనే మీకు శత్రువు. బాహ్యంగా మీకు శత్రువులు ఎవరూలేరు. మీకు శత్రువు మీలోపలే అహంభావనరూపంలో ఉన్నాడు. దానిని అది చంపుకోవటానికి అహంభావన ఇష్టపడదు. నిరంతరము దేవుని స్మరిస్తే అహంభావనయొక్కవేరు ఊడిపోయేప్రమాదం ఉంది. అందువలన సాధనచెయ్యనివ్వకుండా ఎంతసేపు జరిగిపోయిన గొడవలుతలపెడుతూ అది పెరిగిపోతూఉంటుంది. భౌతికంగాగాని, ఆధ్యాత్మికంగాగాని అభివృద్ధిలోనికి రావాలంటే వివేకం అవసరము. వివేకంలోనుండి వైరాగ్యం రావాలి. వివేకంలోనుండి వచ్చిన వైరాగ్యముమాత్రమే నిలబడుతుంది.

మీతలంపులు, కోరికలు అన్నింటిని మూటకట్టి ఒకప్రక్కనపెట్టు. మోక్షమును పొందాలనేకాంక్షను విడిచిపెట్టవద్దు. ఆకాంక్షే మిమ్మలను ఆనందములోనికి తీసుకొనివెళుతుంది. దానిగురించి ఊహించవద్దు. అదివచ్చాక అందులోఉన్న వైభవం మీకు తెలుస్తుంది. దానిగురించి ఊహించుకొంటే మీఊహలే మరల

మీకు అడ్డువస్తాయి. అందరు మోక్షసామ్రాజ్యానికి అధిపతులుకండి. మోక్షసామ్రాజ్యంనుండి శాంతిని, సుఖాన్ని enjoy చెయ్యండి.

బాగుపడాలిఅనే కాంక్షఉంటే కొద్దిగా వెనకో, ముందో మీరు బాగుపడతారు. రైలులో కూర్చొంటే ఒకగంట ఆలస్యంఅయినా గమ్యాన్ని చేరుస్తుంది. అలాగే హృదయాంతరాళములనుండి ఆవస్తువును పొందాలిఅనే కాంక్షరావాలి. వస్తే బాగుపడినట్లే. జ్ఞానమును సంపాదించాలిఅనే కాంక్షవస్తే తప్పనిసరిగామీరు మోక్షమును పొందుతారు. ఎంతో పూర్వజన్మపుణ్యం ఉంటేగాని ఆకాంక్షరాదు. బహుజన్మల కృషిఉంటేగాని ఆత్మజ్ఞానం కలుగదు. మనిషి కృషివలన ఋషిఅవుతాడు.

రోగములలో దీర్ఘరోగం ఏది అంటే సంసారంఅని ఆచార్యులవారు చెప్పారు. ఇది జన్మజన్మలనుండి నీకూడా వచ్చేరోగం. నీశరీరానికివచ్చిన రోగాలు స్మశానంలో శరీరంకాలిపోయినపుడు ఆరోగాలుకూడా కాలిపోతాయి. కాని సంసారంఅనే రోగం స్మశానంలో కాలిపోదు, మందులవలనపోదు. జ్ఞానం సంపాదించటంవలనమాత్రమే ఆరోగం నశిస్తుంది. అజ్ఞానం జ్ఞానంవలన నశిస్తుందిగాని కబుర్లవలనపోదు. అందువలన నీవు కాలమును పాడుచేసుకోవద్దు. నీశక్తిని పాడుచేసుకోవద్దు. వీటిని ఉపయోగించుకొని జ్ఞానసముపార్జనకు ప్రయత్నించు.

మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిచెందకపోవటానికి కారణం రూపబుద్ధి, నామబుద్ధి. ఈదేహాన్ని ఉపయోగించుకొని మోక్షమును పొందమని భగవంతుడు మనకు ఈదేహాన్ని ఇచ్చాడు. కానిమనం ఏమిచేస్తున్నాముఅంటే ఈదేహాన్ని ఉపయోగించుకొని అహంకారాన్ని పెంచుకొంటున్నాము. మన అహంభావన పెరగటానికి దేహం బాగాఉపయోగపడుతోంది. మనిషికి అహంభావన పెరగటానికి రూపబుద్ధి కారణము. ఈరూపాలు అహంభావనకు ఆహారం సప్లయిచేస్తాయి. అహంకారము ఎటువంటిదిఅంటే అది రూపంలేని పిశాచము. కాని అది ఎప్పుడూ ఏదోఒకరూపమును పట్టుకొనిఉంటుంది. రూపంలేకుండా అదిఉండలేదు. అలాగని ఎప్పుడూ ఒక్కరూపమునే పట్టుకొనిఉండదు. రూపాలను మారుస్తూఉంటుంది. అది రూపాలనుపట్టుకొని ఎందుకు ఉంటుందంటే రూపాలనుండి దానికి ఆహారం సప్లయి అవుతూఉంటుంది. ఈఅహంకారమునుండి బయటకు రావటానికి కేవలం మన తెలివితేటలు సరిపోవు. ఏదోఒక అవతారపురుషుని అనుగ్రహం, గురువు అనుగ్రహం ఉంటేగాని దానిలోనుండి బయటపడలేము. బ్రహ్మానుభవం పొందటానికి ప్రేమ, ఏకాగ్రత అవసరము. అందువలన ప్రేమను, ఏకాగ్రతను సంపాదించుకోండి. నువ్వు రోజూచేసేపని ప్రేమతో, ఏకాగ్రతతో చేస్తే నీకు జ్ఞానం కలుగుతుంది. భగవంతునితో మానసిక సంబంధముపెట్టుకోండి. అప్పుడుమనం సంస్కరింపబడతాము.

బుద్ధుడు శరీరం విడిచిపెట్టేటప్పుడు అతని సవతితమ్ముడు ఆనంద్ విలపిస్తూఉంటాడు. అప్పుడు బుద్ధుడు ఆనంద్‌తో నాకోసం విలపించవద్దు. నీవుబాగుపడేవిధానం చూసుకో. బుద్ధుడు చాలాగొప్పవాడు అంటే నీకుఏమీ కలిసిరాదు బుద్ధుడు ఏస్థితినిఅయితే పొందాడో ఆస్థితిని పొందటానికి ప్రయత్నంచెయ్యి అని చెప్పాడు. ఈశరీరాన్ని ఏమిచేయమంటారు అని ఆనంద్ బుద్ధుడిని అడిగాడు. బుద్ధునియొక్క ఔన్నత్యం ఇక్కడ మనకు తెలుస్తుంది. ఇప్పుడుమనం ఉన్నది ఒకఊరేకదా. ఈఊరికి స్మశానం ఉంటుందికదా. ఈ ఊరిలో చనిపోయినవారిని ఏస్మశానంలో తగులబెడుతున్నారో ఈశవాన్నికూడా అక్కడే తగలబెట్టండిఅని చెప్పాడు. దీనికి ఒక ప్రత్యేకతఅంటూ ఏదీలేదు అనిచెప్పాడు.